## ఉమ్రిలో పులి అడుగుల గుర్తింపు

కెరమెరి, ఆగస్టు 24: మండలంలోని ఉమ్రి గ్రామ సమీపంలోని పంటచేనులో శనివారం పులి అడుగులను గుర్తించినట్లు అటవీరేంజ్ అధికారి మజారోద్దీన్ తెలిపారు. ఈ ప్రాంతంలో పులి తిరుగుతుండడంతో ఇందాపూర్, ఖైరితో పాటు సమీపగ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. మహారాష్ట్రలోని తడోబా అడవుల నుంచి పులి ఈ ప్రాంతానికి వచ్చినట్లు పేర్కొన్నారు. అలాగే బోలాపటార్ గ్రామంలోని అటవీప్రాంతంలో చిరుతపులి మేకను వేటాడినట్లు తెలిపారు.

## రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ కరుణాకర్

కాగజ్‌నగర్, ఆగస్టు 24: రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని డీఎస్పీ కరుణాకర్ అన్నారు. శనివారం కాగజ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఆటోడ్రైవర్లకు రోడ్డు భద్రతపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతి డ్రైవర్ తప్పకుండా లైసెన్సు కలిగి ఉండాలన్నారు. అలాగే మద్యం సేవించి డ్రైవింగ్ చేయరాదన్నారు. సమావేశంలో సీఐ శంకరయ్య, ఎస్సైలు దీకొండ రమేష్, సుధాకర్, అంజన్న తదితరులు పాల్గొన్నారు. అనంతరం కళా జాత బృంద సభ్యులతో ప్రదర్శన నిర్వహించారు.

## ఎస్పీఎంలో ట్రేడ్‌యూనియన్ ఎన్నికలు?

కాగజ్‌నగర్, ఆగస్టు 24: ఎస్పీఎంలో ట్రేడ్ యూనియన్ ఎన్నికలు జరిగేందుకు అడుగులు పడుతున్నట్టు ట్రేడ్‌యూనియన్ నాయకులు అంబాల ఓదెలు తెలిపారు. శుక్రవారం స్థానికంగా ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ రాష్ట్రనాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ట్రేడ్‌యూనియన్ నాయకులు కలిసి లేబర్ కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చినట్టు తెలిపారు. శనివారం కమిషనర్ ఎస్పీఎం ట్రేడ్ సంఘాలకు నోటీసులు కూడా వచ్చినట్టు తెలిపారు. వచ్చేనెల 3వ తేదీ లోపు మ్యానువల్ రిటర్న్ సమర్పించాలని సూచించినట్టు పేర్కొన్నారు. ఈప్రక్రియ ప్రారంభించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో ట్రేడ్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు చట్టాలపై అవగాహన




మాట్లాడుతున్న సివిల్‌జడ్జి యువరాజు

జైనూర్, ఆగస్టు 24: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా సివిల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ యువరాజు మాట్లాడుతు బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే వెంటనే పోక్సో చట్టంకింద కేసునమోదు అవుతుందన్నారు. అదేవిధంగా విద్యార్థినులు చదువుకుంటూ ముందుకు సాగాలన్నారు. బాల్యవివాహాల నిర్మూలన చట్టంపై వివరించారు. అదేవిధంగా మొబైల్ ఫోన్‌తో కలిగే లాభనష్టాలపై అవగాహన కల్గించారు. విద్యార్థినులు ముందుచూపుతో అన్నిరకాల జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా అసిస్టెంట్ లీగల్ ఏడ్‌కౌన్సిల్ అంజలీదేవి, జైనూర్ సీఐ ఎలుపుల రమేష్, ఎస్ఎస్సై డొలకాసి సాగర్, అంజనీదేవి, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## స్థానికత కోల్పోయిన వారికి న్యాయం చేయాలి

**● టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్షురాలు శాంతికుమారి**




మాట్లాడుతున్న అధ్యక్షురాలు శాంతికుమారి

రెబ్బెన, ఆగస్టు 24: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో 317 ద్వారా స్థానికత కోల్పోయిన వారికి వెంటనే న్యాయం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్షు రాలు శాంతి కుమారి డిమాండ్ చేశారు. శనివారం స్థానికంగా ఆమె మాట్లాడారు. స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులు మానసిక ఆందోళనకు గురవుతున్నట్టు తెలిపారు. అలాగే బకాయి పడిన కరువు భత్యం కూడా వెంటనే విడుదల చేయాలని డిమాండు చేశారు. వీటితో పాటు పెండింగ్‌లో ఉన్న సమస్యలను కూడా వెంటనే పరిష్కరించాలని తెలిపారు. సమావేశంలో మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, మండల ప్రధానకార్యదర్శి మహేందర్, మండల బాధ్యులు గంగాధర్, రజిని తదితరులు పాల్గొన్నారు.

## 'హిందువులు సంఘటితం కావాలి'

జైనూర్, ఆగస్టు 24: హిందువులు సంఘటితం కావాలని విశ్వహిందూ పరిషత్ జాతీయ అధికారప్రతినిధి రవినూతల శశీధర్ కోరారు. స్థానిక కల్యాణమండపంలో శనివారం ఏర్పాటుచేసిన విశ్వహిందూ పరిషత్ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రానున్న రోజులు అత్యంత క్లిష్టంగా, కఠినంగా రాబోతున్నాయని వాటిని ఎదుర్కోనేందుకు ప్రతిఒక్కరూ సిద్ధంకావాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా రాంజీగోండ్, కుంరంభీం, అంబేద్కర్ శివాజీ మహారాజ్‌ను స్ఫూర్తిగా తీసుకోని హిందూ సమాజం జాగృతం కావాలని కోరారు. కార్యక్రమంలో ఆత్రంభీంరావ్, ఆదివాసీసంఘాల జేఏసీరాష్ట్ర అధ్యక్షుడు కనకయాదవ్‌రావ్, సభ్యులు కెంద్రేశివరాం, కెంద్రే సుబోద్ తదితరులు పాల్గొన్నారు.

# జ్వరాల పంజా!

- జిల్లాలో రోజురోజుకు విజృంభిస్తున్న విషజ్వరాలు
- దగ్గు, జలుబు, ఒంటినొప్పులతో సతమతం
- తీవ్రజ్వరాలతో ఆసుపత్రుల పాలవుతున్న ప్రజలు
- ఎడతెరపిలేని ముసురువర్షాలతో దోమల వృద్ధి
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది లేక రోగుల అవస్థలు



బెజ్జూరు ప్రాథమిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జ్వర బాధితులు

బెజ్జూరు, ఆగస్టు 24: జిల్లాలో పెరిగిపోతున్న జ్వరాలతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. దోమకాటు వ్యాధులు విజృంభించడంతో జ్వరబాధితులు వణికిపోతున్నారు. గ్రామాలు, పట్టణాలు అనేతేడా లేకుండా జ్వరాల బారిన పడ్డ ప్రజలు ఆసుపత్రుల పాలవుతున్నారు. జిల్లాలో డెంగ్యూ పాజిటివ్ కేసులు కూడా పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలో ఇటీవల కురిసిన ఎడతెరపిలేని ముసురు వానకు గ్రామాల్లో దోమల వ్యాప్తి తీవ్రంగా పెరిగింది. దీంతో ప్రజలు జ్వరాల బారిన పడి అవస్థలు పడుతున్నారు. ప్రజలు జలుబు, దగ్గు, ఒంటి నొప్పులు, దురద వంటి కారణాలతో సతమతమవుతున్నారు. ఇంటింటికి జ్వర పీడితులు పెరుగుతుండటంతో ఆసుపత్రులకు వరుస కడుతున్నారు.

### పెరుగుతున్న కేసులు..

జిల్లాలో సీజనల్ వైరల్ కేసులతోపాటు చికున్‌గున్యా, టైఫాయిడ్, డెంగ్యూ కేసులు పెరుగుతున్నాయి. ఆగస్టులో పలు మండలాలు, గ్రామాల్లో జ్వరాల బారినపడ్డ వారి సంఖ్య పెరుగుతూ వస్తోంది. కాగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో చేరుతున్న రోగుల వివరాలు నమోదు అవుతున్నప్పటికీ ప్రైవేటు ఆసుపత్రుల్లో చేరుతున్న రోగుల వివరాలు ప్రభుత్వ లెక్కలకు అందడం లేదు. ఎప్పటికప్పుడు వివరాలను జిల్లా వైద్యఆరోగ్యశాఖకు అంద జేయాల్సిన ప్రైవేటు ఆసుపత్రుల నిర్వాహ కులు పట్టించుకోవడం లేదు. ఫలితంగా జ్వర పీడితుల సంఖ్య స్పష్టంగా తెలియడం లేదు.



చికిత్స కోసం వచ్చిన బాధితులు

### ప్రైవేటుకు పరుగులు..

జిల్లాలో విషజ్వరాలతో బాధపడుతూ ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లినప్పటికీ మెరుగైన వైద్యం అందక ప్రజలు ప్రైవేటు ఆసుపత్రుల కు పరుగులు తీస్తున్నారు. పేద, మధ్యతరగతి ప్రజలు తప్పనిపరిస్థితుల్లో ప్రైవేటు ఆసుప త్రులకు వెళ్తూ.. వేల రూపాయలు ఫీజులు కడుతూ ఆర్థికంగా నష్టపోతున్నారు. జిల్లాలో ఏ ప్రైవేటు ఆసుపత్రి చూసినా రోగులు పెద్ద సంఖ్యలో కనబడుతున్నారు. ఇదే అదునుగా కొందరు ప్రైవేటు యాజమాన్యాలు అందిన కాడికి దోచుకుంటున్నారు. మరో వైపు ప్రభుత్వ ఆసుపత్రుల్లో సరిపడా వైద్యులు, సిబ్బంది లేక పూర్తి స్థాయిలో వైద్యం అందక ప్రైవేటు బాటపడుతున్నారు. జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో సరిపడా వైద్యులు లేనికారణంగా తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటులో వైద్యం చేయించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. దీనికి తోడు మారుమూల గ్రామీణప్రాంతాల్లో ఆర్‌ఎంపీ వైద్యులే దిక్కుగా మారారు. జిల్లాలో 20 ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, 2అర్బన్ వైద్యశాలలు, 6కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ ఆసుపత్రుల్లో కేవలం 12మంది డాక్టర్లు మాత్రమే పనిచేస్తుండగా ముగ్గురు డాక్టర్లు మెటర్నిటీ సెలవులో ఉన్నారు. ఇక జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యసేవలు ఎలా అందుతాయని రోగులు ప్రశ్నిస్తున్నారు. దీంతో మెరుగైనవైద్యం కోసం ప్రైవేటుకు వెళ్లకతప్పడం లేదని పేర్కొంటున్నారు.

### ముందుచూపు ఏదీ?

వానాకాలం ప్రారంభమై మూడు నెలలు గడిచిపోతున్నా దోమల నియంత్రణపై అధికారులకు ముందుచూపు లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించి ఇంటి పరిసిర ప్రాంతాల్లో నిల్వ ఉన్న నీటిని డ్రై చేస్తూ దోమల వృద్ధిని అరికట్టాల్సిన అవసరం ఉంది. కానీ అధికారులు నామమాత్రంగా డ్రైడేను నిర్వహిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. అప్రమత్తంగానే ఉన్నామని వైద్యఆరోగ్యశాఖ అధికారులు చెబుతున్నా జిల్లాలో జ్వరాల కేసులు పెరిగిపోవడం ఆందోళన కలిగిస్తోంది. తీవ్రమైనజ్వరం, ఒళ్లునొప్పులతో బాధపడుతున్న వారంతా డెంగ్యూ పాజిటివ్ అనే అనుమానంతో ఆసుపత్రుల్లో చేరిపో తున్నారు. దోమల నియంత్రణపై యుద్ధప్రాతిపాదికన చర్యలు చేపట్టక పోవడంతో దోమకాటు వ్యాధులు విజృంభిస్తూనే ఉన్నాయి. ఇటీవల కలెక్టర్ గ్రామాల సందర్శనకు వచ్చిన సమయంలో గ్రామాల్లో వ్యాధులు రాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చినా ఎలాంటి చర్యలు కానరావడం లేదు. గ్రామాల్లో నీరునిల్వ లేకుండా చర్యలు చేపట్టాలని సూచించినా పరిస్థితిలో ఎంతమాత్రం మార్పు కనిపించడం లేదు. గ్రామాల్లో క్రమం తప్పకుండా బ్లీచింగ్, ఫాగింగ్ చేయడంతోపాటు దోమల ఉధ్రుతి అధికంగా ఉన్న ప్రాంతాల్లో దోమ తెరల వినియోగంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందంటున్నారు.

## సృజనాత్మకతను పెంచేందుకు మొబైల్ సైన్స్‌ల్యాబ్

**● కలెక్టర్ వెంకటేష్ దోత్రే**




మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 24: విద్యార్థులలో సృజనాత్మకతను పెంచడానికి మొబైల్ సైన్స్‌ల్యాబ్‌లోని ప్రయోగాలు ఉపయోగాత్మకంగా ఉన్నాయని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నతపాఠశాలలో భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో విద్యార్థుల సౌకర్యార్థం సంస్థ డైరెక్టర్ విక్రం మొబైల్‌సైన్స్ ప్రయోగశాలను జిల్లాకలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచడానికి, శాస్త్రీయ దృక్పథాన్ని కల్పించ డానికి ఈ మొబైల్‌సైన్స్ ల్యాబ్‌ని వినియోగించుకోవడానికి సరైనప్రణాళిక తయారు చేసుకోవాలన్నారు. విద్యార్థులకు ప్రయోగాల ద్వారా వివరించితే సైన్స్‌పై ఆసక్తి పెరుగుతుం దన్నారు. భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ డైరెక్టర్ మాట్లాడుతూ మొబైల్ సైన్స్‌ల్యాబ్ విద్యార్థుల్లో సైన్స్ ప్రయోగాలపై అవగాహన పెంచుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో అదనపుకలెక్టర్ దీపక్ తివారి, డీఈవో అశోక్, జిల్లాసైన్స్ అధికారి మధుకర్, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ శ్రీనివాస్, రాంకుమార్, డీఆర్డీఏ డైరెక్టర్ రామకృష్ణ, ప్రధానోపాధ్యాయులు సుభాష్, మహమ్మద్ సాబీర్, తిరుపతయ్య, శాంతికుమార్, ప్రవీణ్, మోహన్, లక్ష్మీప్రసన్న, భారత్ ఎలక్ట్రానిక్స్ ప్రతినిధులు శ్రీనివాస్, అమిత్ బండారి, అశోక్ సింగాల్ తదితరులు పాల్గొన్నారు.

**ఉపకరణాలు అందేలా కృషి చేయాలి..**

ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉపకరణాలు అందేలా విలీన విద్యా రిసోర్స్‌పర్సన్‌లు కృషిచేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో అల్లింకో వారితో నిర్వహించిన ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల ఉపకరణాల గుర్తింపు శిబిరానికి ఆయన, అదనపు కలెక్టర్ దీపక్‌తివారి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ శిబిరాన్ని ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిమండలంలోని ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించి వారికి తగిన ఉపకరణాలు అందించడానికి జిల్లాలోని ఆర్పీలు(రిసోర్స్ పర్సన్) కృషిచేయాలని సూచించారు. అలాగే పిల్లలకు ప్రభుత్వం ద్వారా అందించే సదుపాయాలను వారికి అందే విధంగా చూడాలని అన్నారు. పిల్లల తల్లిదం డ్రులు పిల్లలను బడిలో చేర్పించి విద్యను అందించే విధంగా చూడాలని సూ చించారు. అలాగే అదనపు కలెక్టర్ దీపక్‌తివారి మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలుగల పిల్లలను గుర్తించి వారికి తగిన విద్య,ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో డీఈవో అశోక్, జిల్లా సైన్స్ అధికారి మధుకర్, తదితరులు పాల్గొన్నారు.

**అంగన్‌వాడీకేంద్రాల్లో పిల్లలకు పూర్తిసౌకర్యాలు కల్పించాలి..**

జిల్లాస్త్రీశిశు, దివ్యాంగవయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ వెంకటేష్‌దోత్రే అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని దస్నాపూర్-2 అంగన్‌వాడీ కేంద్రంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి ఆకస్మికంగా సందర్శించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంగన్‌వాడీకేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, పిల్లల సంక్షేమం కోసం పూర్తి సౌకర్యాలు కల్పించడంతోపాటు సకాలంలో పోషక ఆహారాన్ని అందించాలన్నారు. పిల్లల మానసిక, శారీరక ఎదుగుదలను పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వారివెంట సంబంధిత శాఖాధికారులు ఉన్నారు.



శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్

## సంక్షేమ పథకాల అమలు పకడ్బందీగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ గోడం నగేష్

ఆసిఫాబాద్, ఆగస్టు 24: రాష్ట్రఅభివృద్ధిలో భాగంగా కేంద్రప్రభుత్వం మంజూరుచేసిన నిధులతో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలును పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీ గోడం నగేష్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేష్‌దోత్రే, అదనపుకలెక్టర్ దీపక్‌తివారి, ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబుతో కలిసి జిల్లాగ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణకమిటీ జిల్లాస్థాయి సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులనియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వ్యాధుల వ్యాప్తిపై సర్వేనిర్వహించాలని, వ్యాధుల నియంత్రణపై అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లాలో 803మంది ఆశాకార్యకర్తలకుగాను 736మంది పనిచేస్తున్నారని, 67 ఖాళీలు, 22స్టాఫ్‌నర్సుల ఖాళీలను వెంటనే భర్తీచేసే విధంగాచర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో ప్రభుత్వపాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ద్వారా పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందిస్తామని తెలిపారు. మనఊరు మనబడి, అమ్మ ఆదర్శపాఠశాలల కమిటీ పథకాల ద్వారా ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. పంచాయతీరాజ్, రోడ్లు భవనాలశాఖ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి సడక్‌యోజనకింద బీటీరోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుం టున్నామని తెలిపారు. కాగజ్‌నగర్ మున్సిపాలిటీ స్వచ్ఛ భారత్‌లో భాగంగా ఎంపిక అయిందని తెలిపారు. మారుమూల ప్రాంతాల్లో 56బీఎస్ఎన్ఎల్ టవర్లుమంజూరు కాగా10టవర్ల నిర్మాణానికి అటవీ అనుమతులు రావాల్సి ఉందని తెలిపారు. ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం ద్వారా చేతి వృత్తులవారికి రుణాల మంజూరుకు 2048 దరఖాస్తులు రాగా 567మందికి రుణాలు మంజూరుకు సిపారసు చేశామన్నారు. మిగితా దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. జిల్లాలో 41.5కిలోమీటర్ల మేర నాలుగు వరుసల జాతీయ రహదారి ఉందని, రహదారిపై గుంతలు ఏర్పడ్డాయని, వెంటనే పనులు చేపట్టి త్వరితగతిన పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎస్ఈ వాసుదేవ్, డీఈవో అశోక్, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, జిల్లా సంక్షేమశాఖాధికారి భాస్కర్ పాల్గొన్నారు.

## లోక్‌అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కరించేలా చూడాలి

**● జిల్లా సెషన్స్ జడ్జి ఎంవీ రమేష్**



మాట్లాడుతున్న జిల్లా సెషన్స్ జడ్జి ఎంవీ రమేష్

ఆసిఫాబాద్ రూరల్, ఆగస్టు 24: వచ్చేనెల28న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేట్లు చూడాలని జిల్లా సెషన్స్ జడ్జి ఎంవీ రమేష్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలో జిల్లా లీగల్‌సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో న్యాయవాదులు, పోలీసుఅధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ న్యాయవాదులు, పోలీసులు, అధికారులు కక్షిదారులకు అవగాహన కల్పించడంతోపాటు సమయం, డబ్బులు ఆదాచేసుకోవాలని, రాజీమార్గమే రాజమార్గమని అవగాహన కల్పించాలన్నారు. సైబర్‌క్రైంకేసులు, సివిల్‌కేసులనుకూడా రాజీ కుదుర్చుకోవచ్చన్నారు. పోలీసుస్టేషన్ వారీగా, కోర్టువారీగా వివరాలు తెలుసుకోవడంతో పాటు సలహాలు, సూచనలు ఇచ్చారు. సుదూర ప్రాంతాల్లో ఉన్న వారు, కోర్టుకు రాలేని పరిస్థితుల్లో ఉన్న వారు తప్పని పరిస్థితుల్లో వర్టికల్ మోడ్‌లో కూడా కేసులను రాజీ చేసుకోవచ్చన్నారు. దీనికోసం ప్రత్యేకంగా హెల్ప్‌లైన్ నెంబర్ కూడా ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్‌జడ్జి యువరాజు, బార్‌అసోసియేషన్ ప్రధానకార్యదర్శి రాజీవ్‌రెడ్డి,డీఎస్పీసదయ్య, న్యాయవాదులు పి సురేష్, ఎం సురేష్, అమ్రిత్‌పాల్ కౌర్, నరహరి, హరీష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం బ్రహ్మకుమారీలు పాల్గొని రక్షాబంధన్ ప్రాధాన్యతను వివరిస్తూ న్యాయాధి కారులకు, న్యాయవాదులకు, పోలీసులకు రాఖీలు కట్టారు.

## 'పంచాయతీకార్యదర్శి ధ్రువీకరించిన పత్రాన్ని ఇవ్వాలి'

సిర్పూర్(టి)/వాంకిడి, ఆగస్టు 24: రెండు లక్షల రుణమాఫీ కాని, తెల్లరేషన్ కార్డులేని రైతులు వారి కుటుంబసభ్యుల ఆధార్‌నెంబర్ ప్రకారంపూర్తి వివరాలను నమోదు చేసుకుని పంచాయతీ కార్యదర్శివద్ద ధ్రువీకరించిన పత్రాన్ని వ్యవసాయ శాఖాధికారులకు అందజేయాలని ఏవోమధులత, ఏడీఏ మిలింద్ కుమార్ అన్నారు. సిర్పూర్(టి)మండలంలో రేషన్‌కార్డులులేని వారు 285మంది ఉన్నారని జాబితాలో ఉన్న వారే ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాలన్నారు.




## రక్షణ జీఎంను సన్మానించిన అధికారులు

శ్రీరాంపూర్, ఆగస్టు 24: కార్పొరేట్ జీఎం(రక్షణ)గా చింతల శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టి మొదటిసారిగా శ్రీరాంపూర్ ఏరియాకు వచ్చిన సందర్భంగా ఆయనను ఏరియా అధికారులు శనివారం ఘనంగా సన్మానించారు. ఏరియా ఇన్‌చార్జి జీఎం టి శ్రీనివాస్ ఈ సందర్భంగా మాట్లాడుతూ, జీఎం(రక్షణ) చింతల శ్రీనివాస్ ఎంతో అనుభవం కలిగిన అధికారి అని ఆయన సంస్థను ప్రమాదరహితంగా మార్చగలరని తాము ఆశిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బెల్లంపల్లిరీజియన్ జీఎం(రక్షణ) రఘుకుమార్, జీఎం (సీఎంసీ) మోహన్‌రెడ్డి, ఎస్ఓటు జీఎం ఎస్ సత్యనారాయణ, అధికారులసంఘం శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షుడు కె వెంకటేశ్వర్‌రెడ్డి, ఇందారం ఓసీపీ పీవో ఏవీరెడ్డి, డీజీఎం(పర్సనల్) పి అరవిందరావు, ఏజెంట్లు రాముడు, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

## 'మాన్యువల్ బీపీ పరికరాలు ఏర్పాటు చేయాలి'

శ్రీరాంపూర్, ఆగస్టు 24: సింగరేణి ఆస్పత్రులు, డిస్పెన్సరీలలో మాన్యువల్ బీపీ పరికరాలు ఏర్పాటు చేయాలని హెచ్ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, కార్యదర్శి వి అనిల్‌రెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 2020సంవత్సరం నుంచి బీపీపరీక్షించడానికి డిజిటల్‌బీపీ పరికరాన్ని వినియోగించడంవల్ల ఖచ్చితమైన సమాచారం రావడం లేదన్నారు. అందుకే మాన్యువల్ బీపీ పరికరాలు అందించాలని వారు కోరారు.

## కైరిగూడ మేనేజర్‌కు సన్మానం

రెబ్బెన, ఆగస్టు 24: కైరిగూడ ఓపెన్‌కాస్టు మేనేజర్ శంకర్‌ను శనివారం ఏఐటీయూసీ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ కైరిగూడ పిట్ సెక్రెటరీ మారం శ్రీనివాస్, ఆర్గనైజింగ్‌సెక్రెటరీలు రాజేష్, దివాకర్, శేషు, మైన్స్ కమిటీ, సేఫ్టీకమిటీ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం పలు సమస్యలను జీఎం దృష్టికి తీసుకవచ్చారు.

## 'లాభాల వాటాను వెంటనే ప్రకటించాలి'

శ్రీరాంపూర్, ఆగస్టు 24: సింగరేణి సాధించిన లాభాలను ప్రకటించి కార్మికులకు 35శాతం ఇవ్వాలని సీఐటీయూ డివిజన్ నాయకుడు కస్తూరి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఆర్కే-న్యూటెక్ గనిపై శనివారం వాల్‌పోస్టర్లు పంచుతూ, కార్మికుల నుంచి పలుడిమాండ్ల పరిష్కారం కావాలని సంతకాల సేకరణ చేపట్టారు. ఆయాపత్రాలను ఈనెల26న అన్ని గనుల మేనేజర్లకు అందజేస్తామన్నారు. అలాగే 28న జీఎం కార్యాలయం ఎదుట పెద్దఎత్తున ధర్నా చేపడతామని తెలిపారు. గుర్తింపుసంఘం ఎన్నికల్లో విజయం సాధించిన ఏఐటీయూసీ గుర్తింపుపత్రం పొందకుండా తాత్సారం చేస్తోందన్నారు. ఈకారణంగా సింగరేణిలో నెలకొన్న అనేక సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని ఆరోపించారు. కార్మికులకు సొంతింటి నిర్మాణం, అలవెన్సులపై పన్నుమాఫీ, మారుపేర్ల మార్పిడి, తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పెరిక సదానందం, సందీప్, రమేష్, ప్రతాప్, పుల్లారావు, రాజగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

**మందమర్రిటౌన్:** సింగరేణిలో 2023-24ఆర్థిక సంవత్సరానికి కార్మికులు సాధించిన లాభాల వాటా యాజమాన్యం ఎప్పుడు ప్రకటిస్తుందోనని కార్మికులు ఎదురుచూస్తున్నారు. ఆర్థిక సంవత్సరం ముగిసి ఆరునెలలు దాటినా ఇంకా లాభాలవాటా చెల్లించకపోవడం ఏంటని కార్మికులు పేర్కొంటున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం 32శాతం ప్రకటించి చెల్లించింది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం 35శాతం లాభాల వాటా చెల్లించాలని కార్మికసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. అయితే సింగరేణి యాజమాన్యం ఎంతవాటా చెల్లిస్తుందో చెప్పడం లేదని కార్మిక సంఘాలు పేర్కొంటున్నాయి.

## కార్మికుల రక్షణకే మొదటి ప్రాధాన్యం

జైపూర్, ఆగస్టు 24: సింగరేణిలో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగుల రక్షణకు యాజమాన్యం మొదటి ప్రాధాన్యత ఇస్తుందని కార్పోరేట్‌సేఫ్టీ జీఎం చింతల శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం ఐకే1ఏ గని, ఓసీపీని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంస్థ అభివృద్ధికి ప్రతిఒక్కరు కృషిచేయాలని రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించినప్పుడే సంస్థ ముందుకు వెళ్తుందన్నారు. కార్యక్రమంలో బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ అధికారి రఘుకుమార్, ఓసీపీ పీవో ఏవీ రెడ్డి, రక్షణాధికారి శ్రీధర్‌రావు, గని మేనేజర్లు, వెంకటేశ్వర్లు, రవికుమార్, ప్రాజెక్టు ఇంజనీర్ రామకృష్ణరావు పాల్గొన్నారు.



ఐకే ఓసీపీని పరిశీలిస్తున్న సేఫ్టీ కార్పొరేట్ అధికారి శ్రీనివాస్

## సూపర్‌బజార్‌ను సందర్శించిన నాయకులు



మాట్లాడుతూ ఐఎన్‌టీయూసీ నాయకులు

రెబ్బెన, ఆగస్టు 24: బెల్లంపల్లి కైరిగూడ ఏరియాలో మూసివేసిన సూపర్‌బజార్‌ను శనివారం ఐఎన్‌టీయూసీ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్, సింగరేణి సెంట్రల్ కమిటీ నాయకుడు సదాశివ్ మాట్లాడుతూ మాట్లాడుతూ 200మంది ఖాతాదారులున్న సూపర్‌బజార్‌ను మూసివేయటంతో ఇబ్బందులు వస్తున్నట్టు తెలిపారు. ఇప్పటికైనా జీఎం స్పందించి సూపర్‌బజార్‌ను వెంటనే తెరిపించేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కుమారస్వామి, అన్నం లస్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవు

బెల్లంపల్లి, ఆగస్టు 24 : బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలోని 31 వార్డు మహ్మద్‌ఖాసీం బస్తీలో స్క్రాప్ దుకాణంపై శనివారం సాయంత్రం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేశారు. మున్సిపల్ రోడ్డుకు ఇరువైపులా మహ్మద్‌ఖాసీం బస్తీలో స్క్రాప్‌తో పాటు చెత్తాచెదారం వేసి రాకపోకలకు ఇబ్బందులతోపాటు అపరిశుభ్రతతో ప్రజలకు ఇబ్బందులు పడుతున్నారు. బస్తీవాసులు, వాహనదారులు ఆందోళన చేస్తుండడంతో కౌన్సిలర్ రాజలింగు యాదవ్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్, సిబ్బంది స్క్రాప్‌ను మున్సిపల్ వాహనాల్లో తీసుకువెళ్లారు. మున్సిపల్ టీపీఎస్ సంతోష్, ఆర్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకుడి పరామర్శ

సిర్పూర్(టి), ఆగస్టు 24: మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తిరుపతి జ్వరంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా మాజీ జడ్పీటీసీ అజ్మీరా రాంనాయక్ శనివారం పరామర్శించారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.

## మిత్రుడి కూతురు వివాహానికి ఆర్థికసాయం

చెన్నూరు, ఆగస్టు 24: చెన్నూరు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1993-94లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు చిన్ననాటి మిత్రుడి కూతురు వివాహానికి ఆర్థికసాయం చేసి అండగా నిలిచారు. పట్టణానికి చెందిన అట్టెం కిష్టయ్య శనివారం కూతురు వివాహాన్ని జరిపించారు. మిత్రులు తలా కొంత జమ చేసి రూ.70 వేల నగదును వివాహ వేడుకలకు హాజరై కిష్టయ్యకు అందజేశారు.

## ఆర్థిక సహాయం అందజేత

జన్నారం, ఆగస్టు 24 : ఇందన్‌పల్లి నాయకపుగూడ గ్రామానికిచెందిన మూతి ఎల్లవ్వకు మాజీ జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్ రూ.5 వేల ఆర్థిక సహాయం అందించారు. ఎల్లవ్వ కట్టెల కోసం అడవికి వెళ్లి జారి పడడంతో నడుము విరిగిందన్నారు. కమలాకర్, మల్లేష్, రాజు, భూమేష్, శ్రీనివాస్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

**దండేపల్లి:** కాసిపేట గ్రామంలో భర్త హత్య కేసులో భర్త జైలు పాలయ్యాడు. దీంతో ముగ్గురు పిల్లలు అనాథాలుగా మారారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వకుళవేణుగోపాల్‌గౌడ్ శనివారం రూ. 5 వేల ఆర్థిక సహాయం అందించారు. కొండాపూర్‌కు చెందిన అల్లాటి అజయ్, గంధం చరణ్, మేదరిపేటకు చెందిన ఉస్మాన్‌ఖాన్, కాసిపేటకు చెందిన విమల వివిధ కారణాలతో మరణించగా వారి కుటుంబ సభ్యులకు కొక్కిరాల రఘుపతిరావు ట్రస్టు ద్వారా ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు ఒక్కో కుటుంబానికి రూ. 5 వేల ఆర్థిక సహాయం అందించారు. గడ్డం త్రిమూర్తి అందించారు. రవీందర్, సృజన్, భూమన్న, రాజేష్, శ్రావణ్ పాల్గొన్నారు.

**బెల్లంపల్లి:** పెర్కపల్లి గ్రామానికిచెందిన జంగపల్లి స్వామికి వైద్య ఖర్చుల నిమిత్తం జన హిత సేవా సమితి సభ్యులు రూ. 11 వేల ఆర్థిక సహాయం అందించారు. సమితి అధ్యక్షుడు ఆడెపు సతీష్ మాట్లాడుతూ స్వామి భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు కాలు విరిగి నడవలేని స్థితిలో ఉన్నాడన్నారు. దాతల సహాయంతో విరాళాలు సేకరించి ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. సభ్యులు విజయ్‌కుమార్, గిరి ప్రసాద్, గణేష్, స్వామి, సుధాకర్, వెంకటేష్, అజయ్ పాల్గొన్నారు.

మందమర్రిటౌన్: పట్టణంలోని నార్లాపూర్ చెందిన అల్లంల చంద్రయ్య యాదవ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న అఖిల భారత యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకుడు బండి సదానందం శనివారం కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. చంద్రయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు రాజన్న తదితరులు పాల్గొన్నారు.

## మహిళను కాపాడిన పోలీసులు

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 24: పాత మంచిర్యాల బ్రిడ్జిపై నుంచి దూకి ఆత్మహత్యకు యత్నించిన ఆకుతోట లక్ష్మి (30) అనే మహిళను శనివారం బ్లూకోల్ట్ కానిస్టేబుల్స్ సత్యం, ప్రదీప్, సంపత్, హోంగార్డు సంపత్‌లు కాపాడారని పట్టణ సీఐ బన్సీలాల్ తెలిపారు. పాత మంచిర్యాలకు చెందిన మహిళ కుటుంబ కలహాల కారణంగా ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించగా గస్తీ సిబ్బంది గమనించి ఆమెను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కుటుంబసభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చామని సీఐ తెలిపారు. ప్రాణాలను కాపాడిన సిబ్బందికి సీఐ రివార్డును అందించగా డీసీపీ ఏ.భాస్కర్, ఏసీపీ ఆర్.ప్రకాష్‌లు అభినందించారు.

## ద్విచక్ర వాహనం ఢీకొని పాదచారుడి మృతి

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 24: జిల్లా కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంకు సమీపంలో శనివారం గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీకొని ఎస్‌కే మహ్మద్ (50) మృతి చెందాడు. జాఫర్‌నగర్ చెందిన మహ్మద్ కొంత కాలంగా మానసిక స్థితి బాగా లేక కుటుంబసభ్యులకు దూరంగా ఉంటూ ప్లాస్టిక్ డబ్బాలు, అట్టముక్కలు ఏరుకొని జీవిస్తున్నాడు. బ్యాంకు సమీపంలో రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొట్టిందని తెలిపారు. స్థానికులు అంబులెన్స్ ద్వారా ప్రభుత్వాసుపత్రికి తరలించగా పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు వెల్లడించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సనత్ కుమార్ తెలిపారు.

### లక్షెట్టిపేటలో...


కోటయ్య (ఫైల్)

**లక్షెట్టిపేటరూరల్:** కొత్తూరు గ్రామ శివారులో జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని దండేపల్లికి చెందిన అల్వాల కోటయ్య (55) మృతి చెందాడు. కోటయ్య శుక్రవారం జెండా వెంకటాపూర్‌లో బంధువుల ఇంటికి వెళ్లి రాత్రి దండేపల్లికి నడిచి వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి సోదరుడు రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు.

## సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సందర్శించిన జిల్లా రిజిస్ట్రార్

ఏసీసీ, ఆగస్టు 24: మంచిర్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని శనివారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రిజిస్ట్రార్ అశోక్‌కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా మంచిర్యాల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో జరుగుతున్న రిజిస్ట్రేషన్‌ల తీరు, కార్యాలయంలో వసతులను పరిశీలించారు. వివిధ దరఖాస్తులపై కార్యాలయం సిబ్బందిని అడిగి తెలు సుకున్నారు. ఇన్‌చార్జీ సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## కార్యాలయాలను సందర్శించిన విద్యార్థులు

బెల్లంపల్లి, ఆగస్టు 24: బెల్లంపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు శనివారం కోర్టు, పోస్టాఫీసు, ఫైర్‌స్టేషన్, ప్రభుత్వ ఆసుపత్రి, గ్రంథాలయం, పాలిటెక్నిక్ కళాశాలలను సందర్శించారు. నో బ్యాగ్ డే సందర్భంగా పాఠశాలకు పుస్తకాలు లేకుండా వచ్చి కార్యాలయాల్లో వ్యవస్థ ఎలా నడుస్తుందని విద్యార్థులు తెలుసుకున్నారు. కార్యాలయాల అధికారులు విద్యార్థులకు పనితీరు గురించి వివరించారు. ప్రధానోపాధ్యాయుడు రఘుబాబు, వెంకటేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 40 మందికి కంటి ఆపరేషన్లు

లక్షెట్టిపేటరూరల్/హాజీపూర్, ఆగస్టు 24: మంచిర్యాల లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని ఉచిత వైద్య శిబిరం ద్వారా కరీంనగర్ రేకుర్తి కంటి ఆసుపత్రిలో 40 మందికి ఆపరేషన్‌లు చేయించినట్లు లయన్స్‌క్లబ్ సభ్యుడు మధుసూదన్‌రెడ్డి తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని 150 మంది కంటి జబ్బులతో బాధపడుతున్న వారిని గుర్తించి 40 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్‌లు చేయించామన్నారు. లయన్స్‌క్లబ్ సభ్యుడు డేగ బాపు, సురేందర్, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళల దాడులను అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలం

లక్షెట్టిపేటరూరల్, ఆగస్టు 24: మహిళల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలను రూపొందించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ప్రభంజన్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ మహిళలకు రక్షణ కరువైందన్నారు. మహిళలపై దాడులను అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. శ్రీను, అరుణ్, ఇర్ఫాన్, షేక్ రఫీ, మంజునాథ్, పాల్గొన్నారు.

## జిల్లాలో భారీ వర్షం

● కౌటాలలో 86.6 మి.మీ వర్షపాతం నమోదు


బెజ్జూరులో లోలెవల్ వంతెనపై నుంచి ప్రవహిస్తున్న సుస్మీర్ వాగు

ఆసిఫాబాద్/బెజ్జూరు, ఆగస్టు 24: జిల్లాలో శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు భారీవర్షం కురిసింది. బెజ్జూరు మండలంలో వాగులు, వంకలు ఉప్పొంగడంతో పలుగ్రామాలకు రాకపోకలు స్తంభిం చాయి. మండలంలోని కుశ్నపల్లి, సోమినిగ్రామాల మధ్య లోలెవల్ వంతెనలు ఉప్పొంగడంతో వాగు అవతల ఉన్న సుస్మీర్, సోమిని, మొగవెల్లి, ఇప్పలగూడ, బండలగూడ, పాతసోమిని, నాగెపల్లి, గెర్రెగూడ గ్రామాలకు శనివారం మధ్యాహ్నం వరకు రాకపోకలు నిలిచిపోయాయి. కౌటాల మండలంలో అత్యధికంగా 86.6మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. చింతలమానేపల్లిలో 75.8మిల్లీమీటర్లు, తిర్యాణిలో69.5, బెజ్జూర్‌లో 64.8,పెంచికల్ పేటలో54.3, కాగజ్‌నగర్‌లో51.2, సిర్పూర్-(టి)లో 50.3, దహెగాంలో48.5, సిర్పూర్(యు)లో 38.5, రెబ్బెనలో 37.5, ఆసిఫాబాద్‌లో 35.3, జైనూర్‌లో 35.0,కెరమెరిలో 25.3, లింగాపూర్‌లో 20.6, వాంకిడిలో15.8మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

## బురదలో కూరుకుపోయిన వ్యాన్


మినీవ్యాన్‌ను బయటకు తీస్తున్న గ్రామస్థులు

పెంచికలపేట, ఆగస్టు 24: మండలంలోని కమ్మర్‌గాం నుంచి ఆగర్‌గూడ వెళ్లే రహదారి బురద మయంగా మారడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి మినీవ్యాన్ బురదలో కూరుకుపోయింది. దానిని ట్రాక్టర్ సహాయంతో బయటకు తీశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు బాగుచేయాలని ప్రజలు కోరుతున్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

సిర్పూర్(టి), ఆగస్టు 24: మండలంలోని పారిగాం గ్రామ సమీపంలోని పెన్‌గంగా నది ఒడ్డున శనివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై కమలాకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నదిఒడ్డున మృతదేహం ఉన్నట్లు గ్రామస్థులు అందించిన సమాచారం మేరకు అక్కడికి వెళ్లి మృతదేహాన్ని బయటకు తీశామన్నారు. పరిశీలించగా మృతుడి ఎడమ చేతిపై పాము బొమ్మతోపాటు సందీప్ అని పచ్చబొట్టు ఉందని, మృతుడి వయస్సు 38సంవత్సరాలు ఉంటుందన్నారు. ఈ మేరకు మృతదేహాన్ని సిర్పూర్(టి) ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచినట్లు ఆయన పేర్కొన్నారు. సమాచారం తెలిపిన వారు ఎవరైనా ఉంటే పోలీసులను సంప్రదించాలన్నారు.

# ఆర్‌వోఆర్ చట్టంపై సూచనలను ప్రభుత్వానికి నివేదిస్తాం

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 24: ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన ఆర్‌వోఆర్ చట్టం ముసాయిదాపై నిపుణులు, మేధావులు, విశ్రాంత రెవెన్యూ అధికారులు అందించిన సూచనలు, సలహాలను ప్రభుత్వానికి నివేదిస్తామని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో నూతన ఆర్‌వోఆర్ చట్టం ముసాయిదాపై న్యాయవాదులు, విద్యావేత్తలు, విశ్రాంత రెవెన్యూ అధికారులతో చర్చ కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నూతన ఆర్‌వోఆర్ ముసాయిదా బిల్లుపై నిపుణులు అందించిన సలహాలను సీసీఎల్ఏకు నివేదిస్తామన్నారు. రాష్ట్రంలో నెలకొన్న భూ సమస్యల పరిష్కారానికి నూతన చట్టాన్ని రూపొందించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. నూతన చట్టం రూపకల్పనలో ప్రజలను భాగస్వాములను చేయాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్చ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. రైతు సంఘాలు, మేధావులు, విద్యావేత్తలు, న్యాయవాదులు, సలహాలు, సూచనలను రాత పూర్వకంగా కలెక్టరేట్ కార్యాలయంలో అందించాలని, వాటిని ఒక నివేదిక రూపంలో తయారు చేసి సీసీఎల్‌కు అప్పగిస్తామని తెలిపారు. ధరణి పోర్టల్ పేరు మార్పు, నోషనల్ పట్టా సమస్యలను పరిష్కరించాలని, పట్టాదారు మృతి చెందితే వారసత్వ భూముల బదలాయింపులో ప్రక్రియ వేగవంతం, పోర్టల్ ఉపయోగించేందుకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్, నూతన చట్టం అమలుకు ప్రతీ గ్రామానికి రెవెన్యూ ఉద్యోగి ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు అభిప్రాయపడ్డారు. అదనపు కలెక్టర్ మోతిలాల్, ఆర్డీవోలు రాములు, హరికృష్ణ, విశ్రాంత తహసీల్దార్‌లు, రెవెన్యూ అధికారులు, న్యాయవాదులు, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## నిబంధనలకు విరుద్ధంగా తరగతుల నిర్వహణ


తరగతి గదులను సీజ్ చేస్తున్న ఎంఈవో

లక్షెట్టిపేటరూరల్, ఆగస్టు 24: పట్టణంలోని శ్రీచైతన్య టెక్నో స్కూల్‌లో నిబంధనలకు విరుద్ధంగా అనుమతి లేకుండా నిర్వహిస్తున్న 8, 9 తరగతులను శనివారం ఎంఈవో కాసుల రవీందర్ సీజ్ చేశారు. ఆయన మాట్లాడుతూ శ్రీచైతన్య టెక్నో స్కూల్‌లో అనుమతులు లేకుండా 8, 9తరగతులను నడుపుతున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే ఆకస్మికంగా తనిఖీ చేసి రెండు గదులను సీజ్ చేసినట్లు తెలిపారు. అనుమతులు వచ్చే వరకు తరగతులు నడపరాదని యాజమాన్యాన్ని హెచ్చరించినట్లు ఆయన తెలిపారు.

## ఓపెన్ డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 24: అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీ చదవాలనుకునే అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వంగ చక్రపాణి, అంబేడ్కర్ స్టడీ సెంటర్ కో ఆర్డినేటర్ నరేందర్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓపెన్ డిగ్రీ చేసేందుకు ఇంటర్, ఓపెన్ ఇంటర్, ఐటీఐ, ఏదైనా డిప్లమా పూర్తి చేసిన వారు అర్హులని తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీజెడ్‌సీ, బీకాం (కంప్యూటర్స్), కోర్సుల్లో చేరేందుకు అవకాశం ఉందని, అభ్యర్థులు ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు స్టడీ సర్కిల్‌లో గానీ, సెల్ : 7382929719, 7780708354 నెంబర్లను సంప్రదించాలని వారు తెలిపారు.

# యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

బెల్లంపల్లి, ఆగస్టు 24 : విద్యార్థులు, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, క్రమశిక్షణతో చదువుకోవాలని ఏసీపీ రవికుమార్ పేర్కొన్నారు. శనివారం సెయింట్‌మేరీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గంజాయి, మత్తు పదార్థాలు, నూతన చట్టాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఏసీపీ మాట్లాడుతూ గంజాయి, తదితర మత్తు పదార్థాల నివారణపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. అనంతరం ఇటీవల యాంటీ డ్రగ్స్ అంశంపై నిర్వహించిన వ్యాసరచన, డ్రాయింగ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. రూరల్ సీఐ అఫ్జలొద్దీన్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఏసీపీ

### ప్రజల రక్షణ కోసమే తనిఖీలు

**భీమారం:** ప్రజల రక్షణ కోసమే కమ్యూనిటీ కాంటాక్టు ప్రోగ్రాం నిర్వహిస్తున్నామని సీఐ మోహన్ పేర్కొన్నారు. శనివారం బూరుగుపల్లి గ్రామంలో ఇండ్లలో సోదాలు చేయగా నగవత్ కమల, భుక్య మారుతి, ధరవత్ రాజ్యనాయక్, పాల్తె బుజ్జి ఇండ్లలో గుడుంబా తయారీకి ఉపయోగించే 200 లీటర్ల బెల్లం పానకం, 10 కేజీల బెల్లం, 16 లీటర్ల గుడుంబా పట్టుకోవడంతో పాటు సరైన పత్రాలు లేని 34 బైక్‌లు, 2 ఆటోలను సీజ్ చేశారు.

సీఐ మాట్లాడుతూ గుడుంబా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకొంటా మన్నారు. యువకులు, విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. వాహనదారులు అన్ని ధ్రువీకరణ పత్రాలను కలిగి ఉండాలన్నారు. ఏదైనా ఆపద వస్తే డయల్ 100కు సమాచారం అందించా లన్నారు. ఎస్ఐ రాములు పాల్గొన్నారు.

## వైభవంగా ఆలయ పవిత్రోత్సవ పూజలు


గూడెం ఆలయంలో పవిత్రోత్సవ పూజల్లో అర్చకులు

దండేపల్లి, ఆగస్టు 24: గూడెం సత్యనారాయణస్వామి ఆలయంలో ఆలయ పవిత్రోత్సవ పూజలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల కార్యక్రమంలో భాగంగా శనివారం అఖండ దీపస్థాపన, విశ్వేక్సేనారాధన, వాసుదేవ పుణ్యాహవచనం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. యాజ్ఞాచార్యులు అభిరామాచార్యులు, అర్చకులు గోవర్ధన రఘుస్వామి, పండితులు నారాయణశర్మ, ఆంజనేయస్వామి, భరత్‌శర్మ, సంపత్‌స్వామి, జయస్వామిలు పాల్గొన్నారు. ఈవో సంకటాల శ్రీనివాస్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఓరియంట్ కంపెనీలో ఎన్నికలు నిర్వహించాలి


ఆదిలాబాద్ డీసీఎల్ కార్యాలయం ఎదుట మాట్లాడుతున్న నాయకులు

కాసిపేట, ఆగస్టు 24 : దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని దేవాపూర్ లోకల్ ఓరియంట్ సిమెంట్ ఎంప్లాయిమెంట్ వర్కర్స్ యూనియన్ నాయకులు డీసీఎల్ బుచ్చిరెడ్డికి విన్నవించారు. శనివారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని లేబర్ కమిషనర్ కార్యాలయంలో కమిషనర్ బుచ్చిరెడ్డికి వినతిపత్రం అందించారు. యూనియన్ అధ్యక్షుడు ఆడె జంగు మాట్లాడుతూ గుర్తింపు సంఘం కాల పరిమితి ముగిసి 3 ఏండ్లు కావస్తున్నా ఎన్నికలు నిర్వహించకపోవడం బాధాకరమన్నారు. గతంలోనే ఐదు యూనియన్‌లు సమావేశాలు నిర్వహించినప్పటికీ ఎన్నికల నిర్వహణలో యాజమాన్యం, అధికారులు జాప్యం చేస్తున్నారన్నారు. వెంటనే గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని కోరారు. సోయం సూరు, ధర్మారావు, ఆత్రం జంగు, భీమయ్య, శ్రీనివాస్, జగన్, రవిరాజ్, జలపతి, భీంరావు, రాజశేఖర్, విజయ్, ఈశ్వర్ , అరుణ్ పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

జైనూర్, ఆగస్టు 24: మండల కేంద్రంలోని భారతి గ్రామర్ పాఠశాలలో శనివారం గోకులాష్టమి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అదే విధంగా శ్రీకృష్ణుడు గోపికలతో ఉట్టి కొట్టించారు. పాఠశాలలో గోకులాష్టమి వేడుకలు చూసేందుకు గ్రామాల నుండి ప్రజలు తరలి వచ్చారు. పాఠశాల కరస్పాండెంట్ విద్యార్థులకు ప్రత్యేక బహుమతి అందించి ప్రశంసించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పొలిపెల్లి శారద, కరస్పాండెంట్ పొలిపెల్లి నరెందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


బెజ్జూరులో ఉట్టి కొడుతున్న చిన్నారులు

**బెజ్జూరు:** మండలకేంద్రంలోని జ్యోతిబాపూలే విద్యాలయంలో శుక్రవారం శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులతో ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. శ్రీకృష్ణుని వేషాదారణలో చిన్నారులు పలువురిని ఆకట్టుకున్నారు. విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకర్షించాయి.


కౌటాలలో ఉట్టి కొడుతున్న చిన్నారులు


జైనూర్‌లో శ్రీ కృష్ణుడి వేషధారణలో విద్యార్థులు

**కౌటాల:** మండలంలోని పలు పాఠశాలల్లో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులతో శ్రీకృష్ణుడు, గోపికల వేషాదారణలో ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులు ఉట్టికొట్టే కార్యక్రమం ఆకట్టుకుంది.

## సరండి పాఠశాలలో వైద్య శిబిరం

వాంకిడి, ఆగస్టు 24: మండలంలోని సరండి గ్రామ ప్రాథమికపాఠశాలలో శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా జ్వరాలతో బాధపడుతున్న వారినుంచి రక్తనమునాలు సేకరించి మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులు మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, ఫైలేరియా, డయేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు రాకుండా వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఈవో రవిదాస్, ఏఎన్ఎం కృష్ణకుమారి, సిబ్బంది స్వప్న, జాన్కుబాయి పాల్గొన్నారు.


సరండిలో వైద్యశిబిరం నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

దహెగాం, ఆగస్టు 24: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి సజీవన్ అన్నారు. శనివారం మండలపరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా చర్యలు చేపట్టాలన్నారు. వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటేలక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. అనంతరం ప్రాథమికఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్యాధికారిని వివరాలుఅడిగి తెలుసుకున్నారు. ఆయనవెంట ఎంపీడీవో రాజేందర్, ఏపీఎం చంద్రశేఖర్, ఏపీవో కల్పన, కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి సజీవన్

## 'అవినీతికి బాధ్యత వహించాల్సిందే'

రెబ్బెన, ఆగస్టు 24: రెబ్బెన సహకార సంఘంలో జరిగిన అవినీతికి పాలక వర్గమే పూర్తిబాధ్యత వహించాల్సి ఉంటుందని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ సొల్లు లక్ష్మి అన్నారు. శనివారం స్థానికంగా ఆమె మాట్లాడారు. రైతులకు రుణమాఫీ కాకపోయిన కూడా రైతులురుణాలు తీసుకున్నట్టు ఎలా నమోదు చేశారన్నారు. ప్రతిసంవత్సరం ఆడిట్ ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. లోన్లకు కట్టిన డబ్బులను ఎందుకు రెన్యూవల్ చేయలేదని ప్రశ్నించారు. ఇందుకు పూర్తి బాధ్యత పాలకవర్గ సభ్యులే వహించాలని సూచించారు. సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులుగౌడ్, బాలకృష్ణ, నవీన్‌గౌడ్, ఉప్పరి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## సహకార సంఘం సభ్యులపై విమర్శలు సరికాదు


మాట్లాడుతున్న సహకార సంఘ సభ్యులు

రెబ్బెన, ఆగస్టు 24: సహకార సంఘ పాలకవర్గ సభ్యులపై బీజేపీ నాయకులు విమర్శలు చేయటం సరికాదని సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు సంజీవ్ కుమార్, రంగు మహేష్ తెలిపారు. శనివారం స్థానికంగా వారు మాట్లాడుతూ సంఘంలో జరిగిన అవినీతికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. అంతేకాని ఏకంగా సహకార సంఘాన్ని రద్దు చేయాలని పేర్కొనటం సరికాదన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, మాజీఎంపీపీ సౌందర్య, మాజీజడ్పీటీసీ బాబురావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

తిర్యాణి, ఆగస్టు 24: వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున విద్యార్థుల ఆరోగ్యంపై సిబ్బంది శ్రద్ధ వహించాలని జీసీడీవో శకుంతల అన్నారు. శనివారం మండలంలోని చెలిమెల, గిన్నెధరి ఆశ్రమపాఠశాలలను తనిఖీచేశారు. ఈ సందర్భంగా వంటగది, స్టోర్‌రూం తదితరవాటిని పరిశీలించారు. పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. ఆమెవెంట హెచ్‌ఎంలు నాందేవ్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.


వంటశాలను పరిశీలిస్తున్న జీసీడీవో శకుంతల

## ప్రమాదపుటంచున బాలుర గురుకుల పాఠశాల

సిర్పూర్(టి), ఆగస్టు 24: మండలకేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలురగురుకుల పాఠశాల శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ఉంది. మండలంలో మొత్తం 9వసతిగృహాలు ఉండగా బీసీ వసతిగృహం అద్దెభవనంలో కొనసాగుతోంది. బాలుర వసతి గృహం 1991లో నిర్మించగా 33 సంవత్సరాలై శిథిలావస్థకు చేరుకుంది. పాఠశాల భవనం కుప్పకూలే పరిస్థితులు ఉన్నాయని ఇంజనీరింగ్ అధికారులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. ఈ విషయమై అధికారులను సంప్రదించగా భవనం కూలి పోతుందని దీనిపై ప్రభుత్వానికి నివేదిక పంపించామని పేర్కొన్నారు.



శిథిలావస్థకు చేరిన సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల

# ఆంధ్రజ్యోతి



## బురద రోడ్డుపై నాట్లు వేసి
# గిరిజనుల నిరసన


కోయపోచగూడానికి వెళ్లే రోడ్డుపై నాట్లు వేస్తున్న గిరిజనులు


దండేపల్లి, ఆగస్టు 24: మండలంలోని మాకులపేట పరిధిలోని కోయపోశగూడ గిరిజన గూడానికి వెళ్లే దారి పూర్తిగా బురదమయం కావడంతో శనివారం సీపీఎం జిల్లా నాయకులు సంకె రవి గిరిజనులతో కలిసి బురదలో నాట్లు వేసి నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా గిరిజనుల తలరాతలు మారవడం లేదన్నారు. కోయపోశగూడానికి రోడ్డు సౌకర్యం కల్పించడంలో స్థానిక నాయకులు విఫలమవుతున్నారని విమర్శించారు. చిన్న వర్షం పడినా రోడ్డంతా బురదమయంగా మారుతుందని నడవడానికి కూడా కష్టంగా ఉంటుందన్నారు. అధికారులు స్పందించి రహదారిని నిర్మించాలని డిమాండ్ చేశారు. కనికరపు అశోక్, రాములు పాల్గొన్నారు.

### క్రీడల్లో గెలుపోటములు సహజం

జైపూర్, ఆగస్టు 24: క్రీడల్లో గెలుపోటములు సహజమని కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని గురుకుల సాంఘిక సంక్షేమ కళాశాలలో ఏర్పాటు చేసిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 14, 17, 19 జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారులు మంచి ప్రవర్తనతోపాటు ఎంపిక చేసుకున్న క్రీడల్లో రోజు సాధన చేస్తే మంచి ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా నుంచి 70 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్ 14 బాలుర విభాగంలో సుప్రతిక్ వర్మ ప్రథమ, సాయి హృతేష్ ద్వితీయ, అండర్ 17లో శివప్రసాద్ ప్రథమ, వంశీరాజ్ ద్వితీయ, అండర్ 19లో వెంకటేష్ ప్రథమ, శ్రీవత్స ద్వితీయ బహుమతులు గెలుపొందారు. అబ్జర్వర్ గోపాల్, మల్లేష్, పీడీ బాబురావు, సంతోష్, వెంకటేష్, విశ్వంత్‌కుమార్ పాల్గొన్నారు.

## విజృంభిస్తున్న
# దోమలు

- జ్వరాల బారిన పడుతున్న ప్రజలు
- అలంకారప్రాయంగా ఫాగింగ్ యంత్రాలు
- నివారణ చర్యలు చేపట్టడంలో పాలకవర్గాలు విఫలం
- అధికారుల తీరుపై ప్రజల్లో అసహనం


మంచిర్యాల మున్సిపాలిటీలోని అండాళమ్మకాలనీలో ఇళ్ల వద్ద నిలువ ఉన్న మురికి నీరు

మంచిర్యాల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో దోమలు విజృంభిస్తున్నాయి. సాయంత్రమైతే చాలు ప్రజలు తలుపులు, కిటికీలు తెరవాలంటేనే భయపడుతున్నారు. ఆరుబయట సైతం ఉండలేని పరిస్థితి నెలకొంది. వీధుల్లో డ్రైనేజీలను రోజుల తరబడి శుభ్రపరచకపోవడం, మురికి నీటిపై దోమలు వేగంగా వృద్ధి చెందుతుండటంతో ప్రజలు వ్యాధుల బారినపడే అవకాశాలు ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని తక్షణ చర్యలు చేపట్టవలసిన పాలకవర్గాలు, అధికారులు చోద్యం చూస్తున్నారు. దోమల నియంత్రణ చర్యలను మొక్కుబడిగా చేపడుతూ ప్రజారోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. ఈ పరిస్థితి గ్రామ పంచాయతీలతో పోల్చితే మున్సిపాలిటీలలో అధ్వాన్నంగా తయారైంది.

### జాడలేని ఫాగింగ్...

వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఫాగింగ్ చేపట్టలేదు. వర్షాకాలం ప్రారంభమైందంటే గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో సిబ్బంది దోమల నివారణ చర్యలు చేపట్టేవారు. మున్సిపాలిటీల్లో మంచి శుక్రవారం, మంచి ఆదివారం పేరుతో అధికారులు, పాలకులు పారిశుధ్య పనులు నిర్వహించే వారు. ఇందులో భాగంగా పారిశుధ్య కార్మికులతో కలిసి కూడళ్లు, టైర్ల దుకాణాలు, డ్రైనేజీల్లో నీరు నిల్వ ఉండకుండ చర్యలు చేపట్టేవారు. కొబ్బరి బొండాలను జనావాసాల నుంచి దూరంగా తరలించేవారు. ఇళ్లు, పరిసరాలతోపాటు నిర్మాణంలోని నీటి ట్యాంకులు, వ్యర్థాలు, పాత సామగ్రిని తనిఖీ చేసేవారు. నీటి నిల్వలు తొలగించి, దోమల మందు పిచికారీ చేసేవారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో నీటి నిల్వలు పెరిగి దోమలు పెరిగిపోయాయి. వినియోగంలో లేని భవనాలు, నిర్మాణంలో ఉన్న కట్టడాల వద్ద దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. మున్సిపాలిటీల పరిధిలో ఫాగింగ్ యంత్రాలు అందుబాటులో ఉన్నప్పటికీ వాటిని వినియోగించడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పారిశుధ్య సిబ్బందిని నియమించేవారు. ఇదిలా ఉండగా రికార్డుల్లో మాత్రం ఎప్పటికప్పుడు దోమల నివారణ చర్యలు చేపడుతున్నట్లు నమోదు చేస్తుండటం కొసమెరుపు.

### దోమల నివారణ ఇలా

- గ్రామాల్లో పనికి రాని గుంతలు, లోతట్టు ప్రదేశాలు, వినియోగంలేని బావులను పూడ్చి నీరు నిల్వ ఉండకుండా చూడాలి.
- మురుగు నీటి కాల్వల్లో చెత్తాచెదారం వేయకుండా చూడాలి.
- కంప చెట్లు పిచ్చి మొక్కలు, పెంటకుప్పలు. చెత్తచెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.
- చెరువులు, బావులు, కాలువలు, ఇతర నీటి మడుగులలో పెరిగే గుర్రపుడెక్క, తూటు కాడలతో పాటు ఇతర మొక్కలు ఎప్పటికప్పుడు తొలగించాలి.
- నీటి నిల్వలలో వారానికి ఒకసారి ఆయిల్ బాల్స్ చల్లాలి.
- వారానికి ఒకసారి సాయంత్రం వేళ ఫాగింగ్ చేయాలి
- దోమతెరలు దోమలను పారదోలే పరికరాలు ఉపయోగించాలి.
- కిటికీలు, తలుపులకు దోమలు రాకుండా జాలీలు, అమర్చాలి.
- మురికి నీరు నిల్వ ఉంచకుండా జాగ్రత్తలు పాటించాలి.

- దండేపల్లి

### వ్యాధుల బారిన పడుతున్న ప్రజలు

పరిసరాలు పరిశుభ్రంగా లేని కారణంగా వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. దోమకాటు వల్ల మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా లాంటి విష జ్వరాలు సోకుతాయి. ముఖ్యంగా పగలు కుట్టే దోమల పట్ల జాగ్రత్తలు వహించాల్సిన అవసరం ఉంది. వర్షాలు, వాతావరణ మార్పుల కారణంగా ఇప్పటికే ప్రజలు జ్వరాల బారిన పడుతున్నా రు. ఆస్పత్రులలో జ్వరపీడి తుల సంఖ్య రోజు రోజుకూ పెరుగు తోంది. ప్రస్తుతానికి వైరల్ జ్వరాలతో ప్రజలు బాధపడుతున్నప్పటికీ దోమల కారణంగా విష జ్వరాలు సోకే అవకాశాలు ఉన్నాయి. తాగునీరు సరఫరా చేసే ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయని కారణంగా నీరు కలుషితమై అతిసార ప్రబలే ప్రమాదం పొంచి ఉంది. అధికారుల వైఖరిపట్ల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

### క్లోరినేషన్ ఏదీ...?

రక్షిత మంచినీటి ట్యాంకుల్లోనూ క్లోరినేషన్ చేసిన దాఖలాలు కానరావడం లేదు. నిలువ నీరు ఉన్నచోట లార్వా వృద్ధి చెందే అవకాశాలుంటాయి. క్లోరినేషన్ చే యడం వల్ల దోమలు వృద్ధి చెందే అవకాశాలు తక్కువగా ఉంటాయి. అలాగే వీధుల్లోని నాలాల్లో సైతం బ్లీచింగ్ చేయడం లేదు. నీరు నిలువ ఉండే చోట్ల బ్లీచింగ్ చేస్తే ఆదిలోనే లార్వా అంతమై దోమల బెడద తగ్గుతుంది. గ్రామాల్లో చేపడుతుండగా మున్సిపాలిటీల్లో బ్లీచింగ్ చేసిన దాఖలాలు కనబడడం లేదు.

### పల్లెలే నయం...

పారిశుధ్య చర్యలు మున్సిపాలిటీలతో పోలిస్తే పల్లెల్లోనే కొంత మెరుగ్గా ఉన్నట్లు తెలుస్తోంది. వర్షాలు తగ్గుముఖం పట్టగానే పంచాయతీల్లో ఫాగింగ్, క్లోరినేషన్, బ్లీచింగ్ తదితర పనులు చేపట్టారు. వీధుల్లో మొలిచిన గడ్డిని తొలగించడం, డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసే పనులు చేపడుతున్నారు. డ్రైనేజీల్లో లార్వా వృద్ధి చెందకుండా ఉండేం దుకు ఆయిల్ బాల్స్ వేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఆయిల్ బాల్స్ నీటిలో వేయగానే చమురు విస్తరించి, ఆ పరిసరాల్లో దోమల అభివృద్ధికి ఆటంకం ఏర్పడుతుంది. తద్వారా దోమల నివారణకు దోహదపడుతోంది. అయితే ఆ ప్రక్రియంతా కేవలం గ్రామాలకే పరిమితమైంది. ఇప్పటికైనా మున్సిపల్ యంత్రాంగం, పాలకులు స్పందించి దోమల నివారణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

### ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 24: వినియోగదారులకు సరఫరాలో అంతరాయం లేకుండా విద్యుత్‌ను అందించేందుకు చర్యలు చేపడుతున్నామని ఎస్ఈ శ్రావణ్‌కుమార్ అన్నారు. అందులో భాగంగానే ట్రాన్స్‌ఫార్మర్లను ఆధునీకరిస్తున్నామని, శనివారం ఏసీసీ సబ్ స్టేషన్‌లో 12.5 (ఎంవీఏ) సామర్థ్యం గల పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. జిల్లా కేంద్రంలో పెరుగుతున్న విద్యుత్ వినియోగాన్ని దృష్టిలో ఉంచుకొని మరో 33/11కేవీ విద్యుత్ ఉపకేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించామన్నారు. డీఈ కైసర్, పట్టణ ఏడీఈ వేణుగోపాల్, ఏఈ జాన్, లైన్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.

### సబ్‌స్టేషన్‌లో 33కేవీ బ్రేకర్ ఏర్పాటు


బ్రేకర్‌ను ప్రారంభిస్తున్న ఎస్ఈ

కన్నెపల్లి, ఆగస్టు 24: కన్నెపల్లి సబ్‌స్టేషన్‌లో శనివారం రూ. 8.50 లక్షలతో ఏర్పాటు చేసి 33 కేవీ బ్రేకర్‌ను ఎస్ఈ శ్రావణ్‌కుమార్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ బ్రేకర్ ఏర్పాటుతో మండలంలోని గ్రామాల ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందుతుందని తెలిపారు. అధికారులు రాజన్న, రాంచందర్, బాపు, రాహుల్, సిబ్బంది పాల్గొన్నారు.

### కుటుంబ నిర్ధారణకు సంప్రదించాలి

వేమనపల్లి, ఆగస్టు 24: రేషన్ కార్డులు లేని రైతులు రుణమాఫీ కోసం కుటుంబ నిర్ధారణకు తమను సంప్రదించాలని నీల్వాయి క్లస్టర్ ఏఈవో హెఫ్సీబా ఒక ప్రకటనలో తెలిపారు. రుణమాఫీ కానీ రైతులు ఈ నెల 27న నీల్వాయి రైతువేదిక వద్ద ఉదయం 11 గంటల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. రుణమాఫీ కానీ రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### స్టడీ మెటీరియల్ అందజేత

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 24: బీఎస్ రావు ఫౌండేషన్ సభ్యులు పోటీ పరీక్షలకు అవసరమైన స్టడీ మెటీరియల్‌ను మంచిర్యాల లైబ్రరీకి అందజేశారు. ఫౌండేషన్ చైర్మన్ బీఎస్ రావు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రమణ మాట్లాడుతూ అభ్యర్థులు స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బీఎస్ రావు, అడ్వకేట్ జగన్, అచ్చన్న, డాక్టర్ మూర్తి, లైబ్రరీ సిబ్బంది పాల్గొన్నారు.

# పాఠశాలల్లో కృష్ణాష్టమి వేడుకలు


మంచిర్యాల అల్ఫోర్స్ పాఠశాలలో, రామకృష్ణాపూర్ తవక్కల్ పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు

ఏసీసీ, ఆగస్టు 24: జిల్లా కేంద్రంలోని పలు పాఠశాలల్లో శనివారం ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాలేజీ రోడ్డులోని అల్ఫోర్స్ పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో కృష్ణుడి వేషధారణలో గోవర్ధన పర్వతాన్ని ఎత్తిన నృత్యం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి అతిథిగా అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి హాజరయ్యారు. శ్రీకృష్ణ దశావతారాల ప్రదర్శన కన్నులకు కట్టినట్లు చూపించారు. అనంతరం భగవద్గీత పఠనం చేయించారు. చిన్నారులు కోలాటం ఆడి ఉట్టికొట్టారు. లక్ష్మీనగర్ శ్రీచైతన్య పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో పలువురు విద్యార్థులు ఉట్టి కొట్టారు. ఏజీఎం రాజు, ప్రిన్సిపాల్ ఆయూబ్, కోఆర్డినేటర్ జయశ్రీ పాల్గొన్నారు. బైపాస్‌రోడ్డులోని అల్ఫోర్స్ ఇంటర్నేషనల్ పాఠశాలలో ఉట్టి కొట్టారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**రామకృష్ణాపూర్:** రామకృష్ణాపూర్‌లోని తవక్కల్ పాఠశాలలో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. ముఖ్య అతిథులుగా తవక్కల్ విద్యాసంస్థల చైర్మన్ అబ్దుల్ అజీజ్ పాల్గొని కృష్ణాష్టమి గొప్పతనాన్ని వివరించారు. విద్యార్థులు కృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. పాఠశాల ఆవరణలో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**కోటపల్లి:** పలు పాఠశాలల్లో కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. విద్యార్థులు కృష్ణుడు, గోపికల వేషధారణలతో అలరించారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, ఉషోదయ గ్రామర్ పాఠశాల, రాంపూర్ పబ్లిక్ స్కూల్‌లో ఉట్టి కొట్టారు. మోడల్ స్కూల్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఉషోదయ గ్రామర్ పాఠశాల హెచ్‌ఎం ఉమారాణి, రాంపూర్ పబ్లిక్ స్కూల్ కరెస్పాండెంట్ విద్యాసాగర్, సంతోష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**కాసిపేట:** ధర్మారావుపేట ప్రభుత్వ పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. ఆకులు, పూలతో శ్రీకృష్ణుని విగ్రహాన్ని అందంగా తీర్చిదిద్దారు. విద్యార్థులు గోపిక, కృష్ణుల వేషధారణలతో అలరించారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**లక్షెట్టిపేటరూరల్:** బ్రిలియంట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, చైతన్యటెక్ స్కూల్‌లలో ముందస్తుగా కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. ఉట్టి కొట్టే కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థులకు బహుమతులు అందించారు. ఉపాధ్యాయులు అశ్విని, శ్రీనివాస్, శైలజ, శిరీష, కిషన్ పాల్గొన్నారు.


మోడల్ స్కూల్‌లో ఉట్టి కొడుతున్న విద్యార్థులు

**కన్నెపల్లి:** జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. విద్యార్థులు ఉట్టి కొట్టారు.

### ఉద్యోగుల, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న మారం జగదీశ్వర్

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 24: ఉద్యోగుల, ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని టీఎన్‌జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్ అన్నారు. శనివారం టీఎన్‌జీవో భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను ప్రకటించాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, ఆమోదయోగ్యమైన శాతంతో పీఆర్‌సీని వెంటనే ఇవ్వాలన్నారు. పెండింగ్ బిల్లులను చెల్లించాలని, 317 జీవో వల్ల నష్టపోయిన ఉద్యోగులను స్థానిక జిల్లాలకు పంపించాలని, లేకుంటే సెప్టెంబర్ 1న ఉద్యోగులు, ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఇటీవల జరిగిన బదిలీల్లో మిగిలిన స్పౌజ్, ఇతర ఉద్యోగుల బదిలీలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే ప్రతీనెల 1వ తేదీనే జీతాలు చెల్లిస్తున్నందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి, కార్యదర్శి భూముల రామ్మోహన్, పిఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఇన్నారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పొన్న మల్లయ్య పాల్గొన్నారు.

### కేటీఆర్ పరామర్శ

నస్పూర్, ఆగస్టు 24 : పోలీసులు వేధింపులకు గురి చేస్తున్నారంటూ గొంతు కోసుకుని హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నస్పూర్ మున్సిపాలిటీ 21వ వార్డు కౌన్సిలర్, బీఆర్ఎస్ నాయకుడు బేర సత్యనారాయణను శనివారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తారకరామారావు పరామర్శించారు. కుటుంబ సభ్యులను వివరాలను అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు.



### ఇండ్ల పైనున్న విద్యుత్ వైర్ల తొలగింపు


విద్యుత్ లైన్ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్

నస్పూర్, ఆగస్టు 24: మున్సిపాలిటీలోని 21వ వార్డు రాంనగర్‌లో ఇండ్లపై నుంచి వెళ్లిన 11 కేవీ విద్యుత్ లైన్ తరలింపు పనులు శనివారం ప్రారంభమయ్యాయి. విద్యుత్ లైన్ తరలింపునకు రూ.6.20 లక్షలను విద్యుత్ శాఖకు చెల్లించడంతో వైర్లను తరలించే ప్రక్రియను అధికారులు చేపట్టారు. సీసీసీ కార్నర్, సీసీసీ మెయిన్ రోడ్డు నుంచి టాకీస్ ఏరియా వరకు, మరో వాడలో దాదాపు 14 విద్యుత్ స్తంభాలు వేశారు. ఇండ్ల మీద నుంచి వెళ్లిన విద్యుత్ వైర్లను తొలగించి రెండుమూడు రోజుల్లో మరో ప్రాంతం నుంచి కొత్త లైన్ వేయనున్నారు. పనులను మున్సిపల్ చైర్మన్ సుర్మిళ్ల వేణు పలువురు నాయకులు పరిశీలించారు. ఆయన మాట్లడుతూ ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలో భాగంగా ఇండ్లపై నుంచి వెళ్లిన విద్యుత్ లైన్లను తొలగించి మెయిన్ రోడ్డు నుంచి వేయిస్తానని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వార్డు అధ్యక్షుడు గోపతి తిరుపతి, నాయకులు మధు, బేర సత్యం, కుమారస్వామి, రమేష్, రాజన్న, కాలనీ వాసులు పాల్గొన్నారు.

### స్థలం కబ్జా కాకుండా చర్యలు తీసుకోవాలి

బెల్లంపల్లి, ఆగస్టు 24: పట్టణంలో అంబేద్కర్ భవనానికి కేటాయించిన స్థలం కబ్జా కాకుండా చర్యలు తీసుకోవాలని శనివారం దళిత సంఘాల ఐక్యవేదిక అడహక్ కమిటీ నాయకులు మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందించారు. నాయకులు కుంబాల రాజేష్, దుర్గం గోపాల్, రత్నం ఐలయ్య, బందెల మురళీ, శ్రీనివాస్, చంద్రశేఖర్, గోపి పాల్గొన్నారు.

### జిల్లాలో మోస్తరు వర్షం

మంచిర్యాల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గడిచిన 24 గంటల్లో 27.4 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. జన్నారం మండలంలో అత్యధికంగా 58.6 మిల్లీమీటర్లు నమోదుకాగా దండేపల్లి 40.3, తాండూరు 33.1, మందమర్రి 32.7, చెన్నూరు 30.7, కన్నెపల్లి 31.5, జైపూర్ 28.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అలాగే బెల్లంపల్లి మండలంలో 27.4 మిల్లీమీటర్లు, కాసిపేట 27.3, మంచిర్యాలలో 26.3, భీమారం 23.0, భీమిని 22.3, నెన్నెల 22.2, కోటపల్లి 22.1 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

**బెల్లంపల్లి:** బెల్లంపల్లి మండలంలో శనివారం సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై భారీ వర్షం కురిసింది. దాదాపు గంట సేపు భారీ వర్షం పడడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. చంద్రవెల్లి గ్రామంలో చెట్టు విరిగి విద్యుత్ స్తంభంపై పడింది. ఈ సమయంలో విద్యుత్ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు.

**కన్నెపల్లి:** మండల కేంద్రానికి చెందిన గోస్కుల బాపు ఇంటి గోడ శనివారం కూలిపోయింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఇంటి గోడ నాని ఒక్కసారిగా కూలిపోయింది. ఇంట్లో ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. కూలీ చేసుకునే తమకు నష్టపరిహారం అందించాలని బాధితులు కోరారు.

### విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి


మాట్లాడుతున్న జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 24: విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని జిల్లా షెడ్యూల్డు కులముల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు పోటు రవీందర్‌రెడ్డి అన్నారు. శనివారం మంచిర్యాలలోని షెడ్యూల్డు కులముల కార్యాలయంలో వసతి గృహాల సంక్షేమాధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 17 ప్రీమెట్రిక్, 8 పోస్టుమెట్రిక్ వసతి గృహాల్లోని విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వసతి గృహాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. జ్వరాల బారిన పడకుండా ప్రత్యేక శ్రద్ధ చూపాలని, వైద్య సేవలు అందించాలన్నారు. మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని సూచించారు.

### గురుకులాలకు పక్కా భవనాలు నిర్మించాలి

ఏసీసీ, ఆగస్టు 24: గురుకులాలకు పక్కా భవనాలు నిర్మించాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో గురుకుల విద్యాసంస్థల కాళేశ్వరం జోనల్ అధికారికి వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ గురుకులాలు అద్దె భవనాల్లో వసతులు లేకుండా నడుస్తున్నాయని, మెనూ ప్రకారం భోజనం ఇవ్వడంలేదన్నారు. శ్రీనివాస్, క్రాంతికుమార్ ఉన్నారు.

### పొనకల్‌లో పర్యటించిన డీపీవో

జన్నారం, ఆగస్టు 24 : పొనకల్ గ్రామంలో శనివారం డీపీవో వెంకటేశ్వర్‌రావు పర్యటించారు. ఆశ్రమ పాఠశాలను సందర్శించి కిచెన్ షెడ్, డార్మెట్రీలను పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంపీడీవో శశికళ, ఎంపీవో జలంధర్, కార్యదర్శి రాహుల్, బిల్ కలెక్టర్ అనిల్, ఏపీవో ఉన్నారు.